-7 NOV 2020 ENADU

## మొరాయిస్తున్న అంబులెన్సులతో ఆందోళన

**యానాం:** ఏళ్లతరబడి సేవలందించిన అంబులెన్స్‌లు మేం కదల్లేం మొర్రో అంటున్నా బలవంతాన తిప్పుతుండడంతో రోగులు ప్రాణాలరచేత పెట్టుకుని ప్రయాణిస్తున్నారు. ఆస్మాతో ఊపిరి సలపని ఒకరోగిని గురువారం అర్ధరాత్రి తీసుకెళుతుండగా కాకినాడలో అంబులెన్స్ నిలిచిపోయింది. అత్యవసర వైద్యం అందాల్సిన రోగికి ఆక్సిజన్ అమర్చి ఓ ఆటోలో ఆసుపత్రికి తీసుకెళ్లారు. యానాంలో కొత్త అంబులెన్స్‌లు ఏర్పాటుచేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## ఇన్‌ఛార్జి పరిపాలనాధికారిగా కమిషనర్

**యానాం:** యానాం పరిపాలనాధికారి శివరాజ్‌మీనా తన స్వస్థలమైన రాజస్థాన్‌కు శుక్రవారం సెలవుపై వెళ్లడంతో ఇన్‌ఛార్జిగా మున్సిపల్ కమిషనర్ గుజ్జు గౌరీసరోజ వ్యవహరించనున్నారు. మీనా తిరిగి ఈనెల 23న వస్తారు.

## దరఖాస్తుల ఆహ్వానం

**యానాం:** ఆశ్రమ విద్యావిధానంలో అత్యుత్తమ విద్యను అందించే మెట్టకూరు జవహర్ నవోదయ విద్యాలయంలో తొమ్మిదో తరగతిలో 27 ఖాళీల భర్తీకి ఫిబ్రవరి 13న ప్రవేశపరీక్ష నిర్వహిస్తామని, డిసెంబరు 15 లోగా విద్యార్థులు దరఖాస్తు చేయాలని ప్రిన్సిపల్ ఎం.అనురాధ కోరారు.

## యుద్ధప్రాతిపదికన రన్నింగ్ ట్రాక్ పునర్నిర్మాణం

**యానాం:** పుదుచ్చేరి పోలీస్‌శాఖ 429 పోలీస్ పోస్టుల భర్తీకి దేహదారుఢ్య పరీక్ష స్థానిక జీఎంసీ బాలయోగి స్టేడియంలో నిర్వహించాలని నిర్ణయించిన నేపథ్యంలో క్రీడా మైదానంలోని రన్నింగ్ ట్రాక్‌ను యుద్ధప్రాతిపదికన ప్రజాపనులశాఖ పునర్నిర్మిస్తోంది. యానాం నుంచి 1,200 మంది అభ్యర్థులు పోలీస్ గ్రౌండ్ టెస్ట్‌కు పోటీపడుతున్నారు.

ANDHRA JYOTHI

-7 NOV 2020

## 9వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

యానాం, నవంబరు 6: మెట్టకుర్రులోని జవహర్ నవోదయ విద్యాలయంలో 2012-22 విద్యా సంవత్సరానికి సంబంధించి 9వ తరగతిలో ప్రవేశానికి అర్హులైనా విద్యార్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ ఎం.అనురాధ ఓ ప్రకటనలో తెలిపారు. 27సీట్లు భర్తీ చేసేందుకు ఫిబ్రవరి 13వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్టు తెలిపారు. దరఖాస్తులను నవంబరు 4నుంచి డిసెంబరు 15వ తేదీ వరకు www.navodaya.gov.in, www.nvsadmissionclassnine.in ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చొన్నారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 2020-21 విద్యాసంవత్సరంలో 8వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. వివరాలకు www.navodaya.gov.in వెబ్‌సైట్లో సంప్రదించాలన్నారు.

-7 NOV 2020 SAKSHI

## ఎల్జీ బేడీని కలిసిన డీఎంకే ఎమ్మెల్యేలు

యానాం: పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతున్న తరుణంలో పుదుచ్చేరి రాజకీయాల్లో అత్యంత కీలకపరిణామం శుక్రవారం చోటుచేసుకుంది. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ కూటమికి మద్దతునిస్తున్న డీఎంకే ఎమ్మెల్యేలు ప్రభుత్వాన్ని కాదని ఎల్జీ కిరణ్ బేడీని అనూహ్యంగా రాజ్‌నివాస్‌లో కలవడం చర్చనీయాంశమైంది. ఈ సందర్భంగా సౌత్ ఎమ్మెల్యే శివ, నార్త్ ఎమ్మెల్యే ఎస్‌బీ శివకుమార్, కారైకల్ జిల్లా డీఎంకే ప్రతినిధి నజీమ్‌లు ఎల్జీ కిరణ్‌బేడీని కలిసిన వారిలో ఉన్నారు. ఇప్పటికే సీఎం నారాయణసామి ప్రభుత్వానికి రాజ్‌నివాస్‌కు మధ్య ఉప్పు, నిప్పులా ఉన్న పరిస్థితి నేపథ్యంలో వీరు ఏకపక్షంగా ఎల్జీ బేడీని కలిశారు. దీంతో కాంగ్రెస్, డీఎంకే కూటమిలో మిత్రబేధం వల్లే ఈ పరిస్థితి ఉత్పన్నమయ్యిందని విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే తాము ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలల్లో ఉపాధ్యాయులకు 11 నెలలుగా జీతాలు, పెన్షన్‌లు గురించి వినతిపత్రం ఇచ్చినట్లు ఎమ్మెల్యేలు విలేకరులకు తెలిపారు. లాక్‌డౌన్ నేపథ్యంలో విద్యుత్‌టారిఫ్‌ల పెంపు, ప్రభుత్వపాఠశాలల్లోని విద్యార్థులకు 10 శాతం మెడికల్ కోటా అమలు, భారతీ, స్వదేశీ మిల్లుల సమస్యలు, కోఆపరేటివ్ షుగర్ మిల్లు తెరిపించడం, రేషన్ షాపుల ద్వారా సరాసరి ఉచితబియ్యం పంపిణీ తదితర పది సమస్యలను ఎల్జీ దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు. అంతకుముందు వీరంతా చెన్నై వెళ్లి డీఎంకే నేత స్టాలిన్‌తో సమావేశమై కూటమిలో కాంగ్రెస్ పార్టీపై ఫిర్యాదు చేశారు.

## రోజ్‌గార్ మేళాలో పలువురికి ఉద్యోగాలు

యానాం: డేటాప్రో కంప్యూటర్స్ ప్రధానమంత్రి కౌశల్ కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన రోజ్‌గార్ మేళాలో పలువురు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. స్థానిక డేటాప్రో సెంటర్‌లో ఇషుజు, టీవీఎస్, ఫ్లిప్‌కార్ట్, ఏకే నెట్‌వర్క్స్, ఎల్‌ఐసీ తదితర కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరయ్యి 200 మందికి పైగా అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. వీరిలో 65మంది ఎంపికయ్యారని సెంటర్ హెడ్ సూర్యనారాయణ, రవి, చిన్నా తెలిపారు.

-7 NOV 2020 SAKSHI

## మొరాయించిన జీజీహెచ్ అంబులెన్స్

**అర్ధరాత్రి ఆటోలో కాకినాడకు రోగి తరలింపు**

యానాం: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో కాలం చెల్లిన అంబులెన్స్‌లను సంవత్సరాల తరబడి ఉపయోగిస్తుండటంతో ఒక్కోసారి మార్గమధ్యలోనే మొరాయిస్తుండటంతో అత్యవసర సమయాల్లో రోగులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. గురువారం అర్ధరాత్రి సమయంలో యానాం నుంచి అత్యవసరంగా రోగిని కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళుతున్న అంబులెన్స్ కాకినాడ పట్టణ ముఖద్వారం వద్ద ఇంజిన్‌లో సాంకేతిక సమస్య తలెత్తి అకస్మాత్తుగా నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో అంబులెన్స్ సిబ్బంది తక్షణం స్పందించి ఆటో మాట్లాడి రోగిని కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. కాకినాడ-యానాం రహదారిలో ఆగిపోతే మరింత ఇబ్బందులు ఎదురయ్యేవని రోగి బంధువులు ఆందోళన వ్యక్తం చేశారు. యానాం జీజీహెచ్‌లో ఉన్న అంబులెన్స్‌లో ఒకటి తప్ప మిగతావన్నీ అవసాన దశకు చేరుకున్నాయని తరుచూ మార్గమధ్యలో నిలిచిపోతున్నాయని పలువురు చెబుతున్నారు. తక్షణం ప్రభుత్వం స్పందించి నూతన అంబులెన్స్‌లను జీజీహెచ్‌కు సమకూర్చాలని స్థానికులు కోరుతున్నారు.